క్లుప్తంగా

త్రిశక్తి పీఠంలో ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణ శివారు పల్లగిరి గుట్టపై గల త్రిశక్తి పీఠంలో భాద్రపద పౌర్ణమి శుక్రవారం నేపథ్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు వేకువ జామునే ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అన్నదాన కార్యక్రమం జరిగింది.

నేడు మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 58 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్–అఫిషియో మెంబర్లు హాజరు కావాలని కోరారు.

అమ్మవారి దర్శనానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు



పెనుగంచిప్రోలు: గ్రామంలో ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువ జామునుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రూ.50 లక్షలతో వేపలవాగు, ఎర్రకాలువల ప్రక్షాళన



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వేపలవాగు పూడికతీత పనులను 5 వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో సుమారు రూ.50 లక్షల నిధులతో వేపలవాగు, ఎర్రకాలువ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేపలవాగు పూడికతీత వలన వైవై కాలనీ, చింతల తోపు, ఆర్టీసీ కాలనీ వాసులకు వరద వలన వచ్చే ఇబ్బందులు తొలగుతాయన్నారు.

బాలుర హైస్కూల్‌లో మేరీ మిట్టి మేరా దేశ్



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో శుక్రవారం మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు అనంతుల మాధవీలత ఆధ్వర్యంలో బాలబాలికలు, ఉపాధ్యాయులు దేశ నాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాలు, కలశము ధరించి దేశభక్తి నినాదాలతో, సంగీత వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు.

రేపు విజయవాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ అహర్నిశలు కృషి చేస్తుందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి నందిగామకు వస్తున్న యూటీఎఫ్ కళాజాతకు మండలంలోని పరిటాల వద్ద శుక్రవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 1న విజయవాడ వీఆర్ సిద్ధార్థ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య, కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు, సంఘ నాయకులు కామా ప్రభాకర్, కోపూరు నాగేశ్వరరావు, డి.హరిప్రసాద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మండలంలో అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నామని ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన వస్తుందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్‌జానీ, సోలా రాఘవ రాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు జాన్ క్రిస్టోఫర్, డి.సాంబశివరావు, కిన్నెర రవి కుమార్, ఏఎస్ఎన్ మూర్తి, మల్లికార్జునరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన విభిన్నం–ఆర్జన అధికం

- రొటీన్‌కు భిన్నంగా పూలు, కూరగాయల సాగు
- స్వల్ప కాలిక పంటలపై దృష్టి సారిస్తున్న రైతులు
- వాణిజ్య పంటల స్థానే ఉద్యాన పంటల వైపు మొగ్గు
- రెట్టింపు ఆదాయం పొందుతున్న నియోజకవర్గ రైతులు



బంతిపూల సాగుతో రైతు శంకర్

పెనుగంచిప్రోలు: మండలంలో కొందరు రైతులు రొటీన్‌గా పండించే మిర్చి, పత్తి తదితర పంటల సాగుకు స్వస్తి పలికారు. స్వల్పకాలంలో చేతికొచ్చే పంటలపై దృష్టి సారిస్తున్నారు. వాణిజ్య పంటల సాగుతో విసిగి పోయిన రైతులు పూలు, కూరగాయల సాగుపై శ్రీకారం చుట్టారు. పంట సాగుకు ఖర్చులు అన్నీ పోను లాభాలు ఆర్జిస్తున్నారు.

బంతి పూలకు భలే గిరాకీ...

మండలంలోని పెనుగంచిప్రోలు, కొల్లికూళ్ల, కె.పొన్నవరం తదితర గ్రామాలతో పాటు వత్సవాయి మండలంలోని మక్కపేట, గోపినేనిపాలెం, భీమవరం, వేమవరం, వత్సవాయి తదితర గ్రామాలు, జగ్గయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో సుమారుగా 50 ఎకరాలకు పైగా బంతి సాగు చేపట్టారు. ప్రస్తుతం తోటల వద్ద కిలో రూ.50కు పూలు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. పెనుగంచిప్రోలుకు చెందిన గుడిమెట్ల శంకర్ ఎకరన్నర పొలంలో ఈ ఏడాది బంతి సాగు చేశారు. ఎకరానికి రూ.లక్ష ఖర్చు అయినా, ఖర్చులు పోను రూ.లక్ష మిగులుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం వినాయక నిమజ్జనాలతో పాటు దసరా సీజన్‌లో బంతిపూలకు మంచి డిమాండ్ ఉంటుందంటున్నారు.

కొత్తగా లిల్లీ పూల సాగు...

మండలంలోని కె.పొన్నవరం గ్రామానికి చెందిన జక్కులూరి బాబు రెండు ఎకరాల్లో ఈ ప్రాంతంలోనే కొత్తగా లిల్లీ పూల సాగు చేపట్టాడు. యూట్యూబ్‌లో చూసి నూతనంగా ఏదైనా సాగు చేపట్టాలనే ఉద్దేశంతో రాజమండ్రి నుంచి లిల్లీ దుబ్బులు తీసుకొచ్చి గత ఏడాది నుంచి ఈ సాగు చేపట్టాడు. ప్రస్తుతం పూలు కోతకు వచ్చాయి. సాగు చేసిన 6 నెలల నుంచి పూలు వస్తాయని, రెండేళ్ల వరకు పూలు పూస్తాయని అంటున్నాడు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పూలు రూ.80 ధర పలుకుతోందని, అంతా బాగుంటే ఎకరానికి రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే డబుల్ ఆదాయం వస్తుందన్నారు. మార్కెట్ చేసుకుంటే మంచి లాభాలు ఉంటాయన్నారు.

కూరగాయల సాగుతో రోజూ ఆదాయం

కూరగాయల సాగు ద్వారా రోజూ ఆదాయం పొందుతున్నామని మండలంలోని కె.పొన్నవరం గ్రామానికి చెందిన జక్కులూరి సాంబయ్య అన్నారు. రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.1000 వరకు ఆదాయం వస్తోందని, వాతావరణం అనుకూలిస్తే కూరగాయల సాగు లాభదాయకంగా ఉంటుందంటున్నారు. గ్రామంలో ప్రతి కుటుంబం ఎంతో కొంత కూరగాయల సాగు చేస్తోంది. కూరగాయలను జగ్గయ్యపేట, నందిగామ రైతు బజార్లలో విక్రయిస్తున్నారు. మూడు లేదా నాలుగు నెలల్లో పంట చేతికొస్తుందని ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెడితే రూ.20వేలకు పైగా లాభం వస్తుందని రైతులు అంటున్నారు.



లిల్లీ పూల సాగుతో రైతు బాబు



వంగ సాగుతో సాంబయ్య

జగనన్నపై నమ్మకంతోనే వైఎస్సార్ సీపీలోకి వలసలు



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: పార్టీలు, వర్గాలు, కులాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనతో రాష్ట్ర భవితవ్యంపై ఏర్పడిన నమ్మకం, భరోసా తోనే పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వలసలుగా వస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పట్టణంలోని పద్మావతినగర్‌కు చెందిన 10 మంది టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఉదయభాను వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ అణగారిన వర్గాలకు పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారని, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, స్థానిక నాయకులు ఉప్పెల్లి ప్రసాద్, మల్లేల సాయి, మారేపల్లి నాగేంద్రం, నిమ్మల గోపి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

నందిగామ: మండలంలోని కొత్త బెల్లంకొండ వారి పాలెం గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు ఆర్థిక బాధలతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ పండుదొర తెలిపిన సమాచారం ప్రకారం కొత్త బెల్లంకొండ వారి పాలెం గ్రామానికి చెందిన తుళ్లూరి బాబు (30) గత ఏడాది రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. కొంతమేర నష్టం వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరం కూడా మిరప పంట సాగు చేశాడు. పంట సరిగాగా లేకపోవడంతో అప్పులు పెరుగుతాయోమోనన్న భయంతో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి శుక్రవారం నందిగామ పట్టణంలో పంచనామా నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

కంచికచర్ల: రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా, మాజీ మంత్రులు కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), పేర్ని వెంకట్రామయ్య(నాని)లపై హైదరాబాద్‌కు చెందిన పోలిశెట్టి వీరభద్రరావు అనే వ్యక్తి సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేశాడన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. కంచికచర్లకు చెందిన వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ఈనెల 28న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, ఆయన ఫిర్యాదు మేరకు వీరభద్రరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్ జయరాం



వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 9 వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఫాగింగ్, నీళ్ల నిలవ ఉన్నచోట ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడం, ఎబేట్ ద్రావణం పిచికారీ చేయడం లాంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముంగిటే నాణ్యమైన వైద్యం



గండేపల్లిలో ఇంటి వద్దకే వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జెస్సీ లివింగ్ ఫెయిత్

గండేపల్లి(కంచికచర్ల): రోగాలబారిన పడిన వారి ఇంటి వద్దకు వైద్యులే స్వయంగా వెళ్లి సకాలంలో నాణ్యమైన వైద్యం అందించాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని పెండ్యాల పీహెచ్‌సీ వైద్యురాలు జెస్సీ లివింగ్ ఫెయిత్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండేపల్లిలో రోగుల ఇంటికి వెళ్లి శుక్రవారం వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఆరోగ్య సిబ్బంది ముందుగా ప్రతి ఇంటికీ వెళ్లి రోగులను గుర్తించి, వారికి అవసరమైన బీపీ, సుగర్, రక్త పరీక్షలు చేశారని అన్నారు. ఈనెల 23 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి రోగుల యోగక్షేమాలు తెలుసుకుని వారు ఏఏ రోగంతో బాధపడుతున్నారో తెలుసుకుని అవసరమైన పరీక్షలు చేస్తున్నామని అన్నారు. ఏడు రకాల వైద్య పరీక్షలను ఇంటి వద్దనే చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందిపుచ్చుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రష్మి, ఏఎన్ఎం శిరీష, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కంచికచర్ల: జగనన్న ఆరోగ్య సురక్ష–2023 కార్యక్రమం ఈనెల 30వ తేదీ శనివారం నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కంచికచర్ల మండల పరిధిలో ఆరోగ్య శిబిరాలు జరుగనున్నాయని ఎంపీడీఓ కె.బాలశంకరరావు శుక్రవారం తెలిపారు. ఈనెల 30న ఎంపీయూపీ స్కూల్ చెవిటికల్లు, అక్టోబర్ 3న గ్రామ సచివాలయం గనిఆత్కూరు, 4న గ్రామ సచివాలయం పెండ్యాల, 5న రైతు భరోసా కేంద్రం గొట్టుముక్కల, 6న విలేజి క్లినిక్ వేములపల్లి, 7న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంచికచర్ల–2, 9న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంచికచర్ల–3, 10న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోగులూరులో శిబిరాలు నిర్వహిస్తారన్నారు. అక్టోబర్ 11న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిటాల–1, 12న జెడ్పీ హైస్కూలు గండేపల్లి, 13న ఎంపీయూపీ స్కూల్ కొత్తపేట, 16న గ్రామ సచివాలయం కీసర, 17న విలేజి క్లినిక్ పరిటాల–2, 18న ఎంపీపీ స్కూల్ పేరకలపాడు, 19న ఎంపీయూపీ స్కూల్ కునికెనపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏరోజు...ఎక్కడెక్కడ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 21 గ్రామ సచివాలయలలో ఈ నెల 30 నుంచి అక్టోబరు 30 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు జరుగుతాయని ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామాలలో వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్‌లు నిర్వహించిన సర్వే ఆధారంగా వైద్య శిబిరాలు జరుగుతాయన్నారు. 30న బలుసుపాడు ఎంపీపీ పాఠశాల, నవంబరు మూడున బండిపాలెం విలేజ్ క్లినిక్, ఐదున అనుమంచిపల్లి గ్రామ సచివాలయం, ఆరున ధర్మవరప్పాడు తండా విలేజ్ క్లినిక్, ఏడున అన్నవరం ఎంపీపీ పాఠశాల, తొమ్మిదిన గౌరవరం, జెడ్పీ పాఠశాల, 10న తక్కెళ్లపాడు ఎంపీపీ పాఠశాలలో శిబిరాలు జరుగుతాయన్నారు. అక్టోబర్ 11న జయంతిపురం గ్రామ సచివాలయం, 12న చిల్లకల్లు–1 గ్రామ సచివాలయం, 13న చిల్లకల్లు–2 గ్రామ సచివాలయం, 16న గండ్రాయి–1 జెడ్పీ పాఠశాల, 17న గండ్రాయి–2 జెడ్పీ పాఠశాల, 18న కె.అగ్రహారం ఎంపీపీ పాఠశాల, 19న మల్కాపురం ఎంపీపీ పాఠశాల, 20న ముక్త్యాల జెడ్పీ పాఠశాలలో శిబిరాలు నిర్వహిస్తారని చెప్పారు. అక్టోబర్ 21న పోచంపల్లి ఎంపీపీ పాఠశాల, 25న షేర్‌మహ్మద్‌పేట–1 ఎంపీపీ పాఠశాల, 26న షేర్‌మహ్మద్‌పేట–2 ఎంపీపీ పాఠశాల, 27న బూదవాడ ఎంపీపీ పాఠశాల, 28న వేదాద్రి సచివాలయం, 30న చిల్లకల్లు–3 గ్రామ సచివాలయాలలో సురక్ష శిబిరాలు జరుగుతాయన్నారు.

నేడు బలుసుపాడులో..

బలుసుపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభిస్తారని తెలిపారు.

అడిగిన దానికి మించి చేసే సీఎం జగన్

నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, వేదికపై ఎమ్మెల్సీ

నందిగామటౌన్: అడిగిన దానికన్నా ఎక్కువ మేలు చేసే వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. స్థానిక శ్రీకరం కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ నందిగామలో తాము అడగగానే ఒక్క క్షణం ఆలోచించకుండా వెంటనే వంద పడకల ఆస్పత్రి మంజూరు చేశారని సీఎంను ప్రశంసించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరొకసారి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు ఇప్పటివరకు జరిగిన మంచి నిరాటంకంగా కొనసాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పార్టీ పట్టణ, మండల కన్వీనర్‌లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, వేమా సురేష్‌బాబు, నన్నపనేని నరసింహారావు, ఆవుల రమేష్‌బాబు, కందుల నాగేశ్వరరావు, చల్లా బ్రహ్మేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యులు గాదెల వెంకటేశ్వరరావు, ముక్కపాటి నరసింహారావు, వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, మలక్ బషీర్, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- 19 వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



19 వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఉదయభాను

జగ్గయ్యపేటఅర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం వెల్లి విరుస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9 వ సచివాలయం పరిధిలో 19 వ వార్డులో ముక్త్యాల రోడ్, పాతపేట గడ్డ, ముత్యాలమ్మ గుడి సెంటర్, పొగాకు సందు తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉదయభాను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేసి ప్రభుత్వం ద్వారా వారు పొందిన లబ్ధిని వివరించారు. వార్డులో ప్రజలు చెబుతున్న సమస్యలను సావధానంగా వింటూ, అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజల మన్ననలందుకుంటున్నారు. వార్డులో ముఖ్యంగా డ్రెయిన్లు నిర్మించాలని ప్రజలు కోరగా, మున్సిపల్ అధికారులతో మాట్లాడి రోడ్ల వెడల్పుకు తగిన విధంగా డ్రెయిన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు నూకల సాంబ, పందుల రోశయ్య, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, నాగలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గొల్లపూడి ముక్తేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చారుగుండ్ల కొండ, బద్దూనాయక్, గోలి శ్రీనివాస్, శ్రీనివాస బ్రహ్మం, అన్నెపాగ రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు



పెనుగంచిప్రోలులో నవరాత్రుల వేడుకల్లో సత్యనారాయణస్వామి వ్రతం



పేట పోలీస్ స్టేషన్‌లోని మండపంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్

పెనుగంచిప్రోలు: చవితి పందిళ్లలో పూజలు అందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలతో పాటు మండలంలో పలు ప్రాంతాల్లో, ఆలయాల్లో ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు శుక్రవారం తీన్‌మార్ మోతలు, బాణసంచా మెరుపుల మధ్య జరిగాయి. ఊరేగింపుల అనంతరం విగ్రహాలను స్థానిక మునేరులో, కాలువల్లో నిమజ్జనం చేశారు. స్థానిక బాలాంజనేయస్వామి వారి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు.

వైభవంగా గణేశ నవరాత్రి ఉత్సవాలు

జగ్గయ్యపేటఅర్బన్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలో శుక్రవారం 12 వ రోజున పలు వార్డులలోని మండపాలలో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మండపాలలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహాల వద్దకు భక్తులు తరలివచ్చి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోని మండపం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నాయకులు శామ్యూల్, చిరంజీవి, ఎస్ఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తొర్రగుంటపాలెంలోని ఆర్టీవో కార్యాలయం రోడ్‌లో ఏర్పాటుచేసిన మండపంలో వైఎస్సార్ సీపీ యువజన నేత, కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణప్రసాద్ పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

వీరులపాడు: వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన వినాయక మంటపాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని జుజ్జూరు, జయంతి, కొణతాలపల్లి, తదితర గ్రామాలలో కొలువుదీరిన గణనాథులను శుక్రవారం విద్యుత్ దీప కాంతులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాలపై భారీ ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు, గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కంచికచర్ల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో జరిగిన సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయిన ఘటన మండలంలో శుక్రవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం బోనకల్లు మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఎస్.నరసింహారావు బైక్‌పై విజయవాడ వైపునకు వెళుతుండగా మండలంలోని పరిటాల గ్రామ పరిధిలోని ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో నరసింహారావుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని వైద్యం నిమిత్తం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో స్థానిక పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కాగా హైవే అంబులెన్స్ వాహన సిబ్బంది ప్రథమ చికిత్స చేసి అనంతరం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

జగ్గయ్యపేటఅర్బన్: వ్యవసాయశాఖ ఏడీఏగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సి.భవాని శుక్రవారం ఎమ్మెల్యే సామినేని ఉదయభానును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్కను అందజేశారు. ఉదయభాను ఆమెకు శుభాకాంక్షలు తెలియజేసి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషిచేయాలని ఆకాంక్షించారు.